సాక్షి
తిరుపతి
శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



మహాపాదయాత్రకు బ్రహ్మరథం

తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన గడపగడపకు మహాపాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. - 8లో



ఆందోళన వద్దు

రేషన్‌కార్డుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ నిత్యావసర సరుకులు అందిస్తామని డీఎస్‌ఓ తెలిపారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	34	22
చిత్తూరు	33	22
తిరుమల	30	18
గూడూరు	35	24
నగరి	34	23

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 72,230 మంది స్వామివారిని దర్శించుకోగా 27,388 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.74 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ముక్కంటి సేవలో ప్రముఖులు



రాహుకేతు పూజలు చేయించుకుంటున్న సినీ హీరోయిన్ కావ్య

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. బలగం సినిమా హీరోయిన్ కావ్య, తమిళనాడు రామనాథపురం డీఎంకే ఎమ్మెల్యే ముత్తురామలింగం వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలుఅందజేశారు.

ఉపాధి పనులు పెంచండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ఉపాధి పనులు పెంచాలని, కూలీల వలసలు పోకుండా గిట్టుబాటు కూలి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జలజీవన్‌మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయిలను ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా నిర్ణయించిన సమయానికి భూసర్వే పనులు పూర్తి చేయడంతోపాటు భూహక్కు పత్రాల్లో తప్పులు లేకుండా రైతులకు అందించాలని కోరారు. సరిహద్దులు ఏర్పాటు చేయాలని చెప్పారు. సహకార సంఘాలకు చెందిన గోడౌన్లు సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ అధికారులు ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలని, ఫర్టిలైజర్స్ కొరత లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి జయరాజ్, జిల్లా పంచాయతీ అధికారి శంకర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ యువతీయువకులకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ నేతృత్వంలో దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ ప్రిన్సిపల్ రమణ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ టెక్నాలజీ, అప్‌లైడ్ న్యూట్రిషన్‌లో నైపుణ్యాలను పెంపొందించడానికి శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ సందర్భంగా ఉచితంగానే భోజన వసతి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రధానంగా డెమీ చెఫ్ ద పార్టీకి చెందిన నాలుగు నెలల కోర్సు(కిచెన్ సూపర్‌వైజర్లు), మూడు నెలల రెస్టారెంట్ కెప్టెన్ కోర్సులో శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్, ఐటీఐ ఉత్తీర్ణత సాధించి, 18- 28ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 16వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. శిక్షణ అనంతరం స్కిల్ ఇండియా సర్టిఫికెట్ ఇస్తామన్నారు.ఆసక్తి ఉన్నవారు అదనపు సమాచారం కోసం 91609 12690, 97013 43846, 90326 97478 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జగనన్న అనుగృహం



పక్కాగృహం ప్రారంభిస్తున్న మంత్రి రోజా



కాయం లేఅవుట్ ప్రారంభోత్సవంలో మంత్రి రోజా, ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

'సొంతిల్లుకట్టుకుని, అందులో కుటుంబంతో హాయిగా జీవించాలన్నది సగటు మనిషి కల. వారి కల నెరవేర్చాలని భావించారు జగనన్న. అందుకే ప్రభుత్వ నిధులతో పేదలకు సొంతింటి స్వప్నం నెరవేర్చారు. గురువారం ఆ ఇళ్లను పేదలకు పంపిణీ చేశాం. సామూహిక గృహప్రవేశాలు నిర్వహించాం.' అని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు.

- పేద అక్కచెల్లెమ్మల చేతుల్లో రూ.3 లక్షల కోట్ల సంపద
- జిల్లాలో 92,700 ఇళ్లు మంజూరు
- ప్రస్తుతానికి 31,700 ఇళ్లు పూర్తి
- కాయంలో 420 ఇళ్ల సామూహిక గృహప్రవేశాలు
- పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: రాష్ట్రంలోని లక్షలాది మంది పేద అక్క, చెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదరిల్లులాంటి గృహాలను నిర్మించి ఇచ్చారని, రూ.3 లక్షల కోట్ల సంపదను వారి చేతుల్లో పెట్టారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖా మంత్రి ఆర్కే రోజా తెలిపారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గురువారం వడమాలపేట మండలం కాయం వద్ద జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన 420 గృహాలను మంత్రి ఆర్కే రోజా, ఎంపీ రెడ్డెప్ప, తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డితో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి రోజా మాట్లాడుతూ ప్రతి పేదింటి మహిళ చిరకాల స్వప్నం అయిన సొంతింటిని అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటి స్థలం, ప్రాంతం ఆధారంగా కనీసం రూ.2.50 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఉంటుందని, స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంతోపాటు రూ.1.80 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారన్నారు. అంతే కాకుండా పావలా వడ్డీకే రూ.35 వేల చొప్పున బ్యాంకు రుణాలను అందించడం, ఉచితంగా ఇసుక, తక్కువ ధరలకే నిర్మాణ సామగ్రిని అందించి, మరో రూ.40 వేల మేరకు లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. మొత్తం మీద ఒక్కో ఇంటిని రూ.2.70 లక్షలతో నిర్మించారని చెప్పారు. లేఅవుట్లలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటర్లు తదితర మౌలిక వసతులను కల్పించి, మోడ్రన్ కాలనీలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గత చంద్రబాబు ప్రభుత్వానికి, నేటి జగనన్న ప్రభుత్వానికి తేడాను గమనించాలన్నారు. ఆ తేడా ఆమె మాటల్లోనే..



జగనన్న పక్కా ఇంటి ముందు ఉన్న మంత్రి రోజా, ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

గత ప్రభుత్వంలో అలా..

- ఇల్లు లేని నిరుపేదలు పెద్ద సంఖ్యలో ఉన్నా కనీసం ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్న ఆలోచన చేయలేదు.
- టిడ్కో ఇళ్ల పేరిట పేదల నుంచి రూ.కోట్లు వసూలు చేసి, వాటిని పూర్తి చేయకుండా వదిలేశారు. మౌలిక వసతుల ఊసే లేదు.
- ఎన్నికల ముందు నామమాత్రంగా ఇళ్లు మంజూరు అంటూ నాటకాలు.
- వాటి కోసం జన్మభూమి కమిటీ నాయకుల ముందు మోకరిల్లాల్సిన దుస్థితి.

జగనన్న ప్రభుత్వంలో ఇలా..

- రాష్ట్రవ్యాప్తంగా 30.75 లక్షల ఇళ్ల పట్టాల పంపిణీ.
- రూ.76 వేల కోట్లతో 17,005 లేఅవుట్లలో వైఎస్సార్–జగనన్న కాలనీల ఏర్పాటు.
- 21.76 లక్షల ఇళ్ల నిర్మాణాలు, ఇప్పటికే 7.43 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి, పేద మహిళలకు అందజేత.
- కేవలం ఒక్క రూపాయికే సర్వహక్కులతో 300 చదరపు అడుగుల టిడ్కో ఇళ్ల పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్సీ విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు యాదవేంద్రరెడ్డి, కరుణాకర్‌చౌదరి, విజయలక్ష్మి, రేణుక, కుసుమ, కిరణ్, చంద్రారెడ్డి, రామిరెడ్డి, శేఖర్, మునిబాబు, సుధీర్‌రెడ్డి, నందయ్య, సురేష్‌రాజు, మునిశేఖర్, గాంధీ పాల్గొన్నారు.

జగనన్న దేవుడు



"నాకు పెళ్లి అయిన నాటి నుంచి అద్దె ఇంట్లోనే ఉన్నా. నా భర్త కూలీ. మాకు సొంతిల్లు అనేది ఓ కలగా ఉండేది. జగనన్న చలవతో నాకు పట్టా ఇచ్చి స్థలం చూపించారు. ఇల్లు కట్టుకోవడానికి డబ్బిచ్చి ప్రోత్సహించారు. రూ.6 వేలు వరకు అద్దె చెల్లిస్తున్న నేను ఈ రోజు సొంతింటిలోకి రావడం జగనన్న మాకు ఇచ్చిన గొప్ప బహుమతి. జగనన్న మాకు దేవుడిచ్చిన అన్న. ఆయన రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిది. ఆయన మళ్లీ సీఎం కావాలన్నదే మా కోరిక.

– ఎం.లత, కల్లూరు గ్రామం, వడమాలపేట మండలం

మంత్రి రోజమ్మ ప్రోత్సాహం మరువలేం



మంత్రి రోజమ్మ ప్రోత్సాహంతో ఇల్లు పూర్తి చేసుకోగలిగాను. ఆమె అప్పుడప్పుడు వచ్చి మమ్మల్ని ఇంటి నిర్మాణం పనులు ఆలస్యం చేయవద్దని సూచించేది. ప్రభుత్వం నుంచి ఇసుక, ఇతర సామగ్రి తక్కువ ధరకు ఇప్పించింది. ఇంటి పట్టా ఇచ్చినప్పటి నుంచి ఇల్లు పూర్తయ్యే వరకు ఆమె మాకు అండగా నిలిచారు. జగనన్న ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉన్నాం. నా భర్త సురేష్ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. ఏమీలేని చంద్రలేఖ నేడు రూ.పది లక్షల ఆస్తిపరురాలైంది.

– ఎస్.చంద్రలేఖ, ఓబీఆర్ కండ్రిగ, వడమాలపేట మండలం

డబుల్ డెక్కర్ ప్రారంభం

- జెండా ఊపి ప్రారంభించిన టీటీడీ చైర్మన్, మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్లు



డబుల్ డెక్కర్ బస్సులో ప్రయాణిస్తున్న టీటీడీ చైర్మన్, మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్



తిరుపతిలో డబుల్ డెక్కర్ బస్సును ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్ర నారాయణ

తిరుపతి సిటీ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన డబుల్ డెక్కర్ బస్సును టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు అభినయరెడ్డి, ముద్ర నారాయణ గురువారం ఎస్వీజేఎస్ఎం క్రీడా మైదానంలో జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అక్కడ నుంచి జ్యోతి థియేటర్ కూడలి, టౌన్ క్లబ్, ఎస్వీ యూనివర్సిటీ వరకు వెళ్లి, అక్కడ నుంచి టౌన్ క్లబ్ కూడలి మీదుగా అలిపిరి కూడలి, కపిల తీర్థం కూడలి వరకు వెళ్లి శ్రీనివాస సేతు మీదుగా మామిడి కాయల మండీ వరకు వెళ్లారు. తిరిగి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. బస్సులో టీటీడీ చైర్మన్, మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, అధికారులు ప్రయాణించారు. గ్రామదేవత గంగమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలోనే మొట్టమొదటి సారిగా ఈ డబుల్ డెక్కర్ బస్సును తిరుపతిలో ఏర్పాటు చేయడం సంతోషం అన్నారు. తిరుపతి నగరం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని, కౌన్సిల్ ఆమోదంతో ఈ బస్సును నగరపాలక సంస్థ కొనుగోలు చేసిందన్నారు. ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి అందాలను వీక్షించేందుకు వీలుగా ఈ డబుల్ డెక్కర్ బస్సును ఏర్పాటు చేశామని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ బస్సు నాలుగు మార్గాల్లో నడపనున్నామని తెలిపారు. ఈ ఎలక్ట్రిక్ ఏసీ బస్సు నిర్వహణను పరిశీలించిన తరువాత మరో నాలుగు బస్సులను అందుబాటులోనికి తెస్తామన్నారు. ఈ బస్సులో ప్రయాణించడం కొత్త అనుభూతిని కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, గంగమ్మ గుడి ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఎస్ఈ మోహన్, డీసీ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఎంఈ చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, డీఈ విజయ్ కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గానికి ఆరాధ్యుడు సీఎం జగన్



మాట్లాడుతున్న వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంరెడ్డి

తిరుపతి రూరల్: కార్మికుల కష్టాలను గుర్తించి వారికి తగిన వేతనాలను అందిస్తూ కార్మిక వర్గానికి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అభయం ఇస్తూ, ఆరాధ్యుడిగా నిలిచారని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ చైర్మన్ గౌతంరెడ్డి తెలిపారు. ప్రజాసంకల్పయాత్రలో కార్మికుల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారన్నారు. గురువారం స్థానిక తిరుచానూరు శిల్పారామం వేదికగా వేతనాల పెంపు నేపథ్యంలో టీటీడీలో పనిచేసే కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా గౌతంరెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరయ్యారు. గౌతంరెడ్డి మాట్లాడుతూ నేడు వేతనాల పెంపుతో కార్మికుల జీవితాల్లో ఆనందం నెలకొందన్నారు. టీటీడీ, ఆశావర్కర్లు, అంగన్వాడీ, విద్యుత్ శాఖ, విశ్వవిద్యాలయాలు తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే కార్మికుల వేతనాన్ని పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించారని గుర్తుచేశారు. టీటీడీ ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలను పెంచుతూ టీటీడీ బోర్డు సమావేశంలో చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రకటించడం సంతోషదాయకమన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ విలీనం చేసిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం తీసుకొచ్చి, పేద ప్రజలను అమెరికా చట్టసభల్లో ప్రసంగించేలా చేశారని తెలిపారు.

కార్మికుల ఇబ్బందులపై దృష్టి

తుడా చైర్మన్, టీటీడీ పాలకమండలి ఎక్స్ అఫిషియో సభ్యుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ టీటీడీ లో పనిచేసే కార్మికులందరినీ కార్పొరేషన్‌లో విలీనం చేసేందుకు పాలకమండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. టీటీడీ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు శ్రీవారి దర్శనం, లడ్డూ, వడ, మహిళా కార్మికులు విధుల్లో దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక గది ఏర్పాటుపై పాలకమండలి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్మికుల వేతనాల పెంపు అంశంలో ఎక్స్ అఫిషియో సభ్యులుగా భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జోనల్ ఇన్‌చార్జ్ రాజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి పాల్గొన్నారు.

జగన్ పాలన బాగుంది నాయనా..!

- గడప గడపకు మన ప్రభుత్వంలో 80 ఏళ్ల బామ్మ హర్షం



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ముందు జగన్ పాలనపై హర్షం వ్యక్తం చేస్తున్న వృద్ధురాలు షేక్ నన్నేమ్

వెంకటగిరిరూరల్ : 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనవడు రాష్ట్రంలో కులం, మతం భేదాలు చూడకుండా ప్రతి ఒక ఇంటికీ పథకాల రూపంలో రూ.లక్షల నగదు అందిస్తున్నారు. ఈ విధమైన పరిపాలనతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉంటున్నారు. ఈసారి కూడా ఆ మనవడే సీఎం కావాలి.' అని వెంకటగిరిలోని బంగారుపేటకు చెందిన షేక్ నన్నేమ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం బంగారుపేటలో నన్నేమ్ అనే వృద్ధురాలు వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆ బుక్‌లెట్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం చూసి, ఆ అవ్వ మురిసిపోయింది. పొద్దు పొడవకముందే వలంటీర్ ఇంటి వద్దకే పింఛన్ తెచ్చి ఇస్తున్నాడని చెప్పారు. మా లాంటి వృద్ధులకు ఇంటి ముంగిటకే పింఛన్ అందించడం సంతోషకరంగా ఉందన్నారు. అలాగే ఎవరి సిఫార్సు లేకుండానే పథకాలు అందిస్తున్నారన్నారు. ఇక అదే ప్రాంతానికి చెందిన కె వెంకటేశ్వర్లు అనే వ్యక్తి నవరత్నాల పథకాల ద్వారా ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా సంక్షేమ పథకాలు ఇస్తున్నారని, ఇదే ఉత్సాహంతో ప్రజల్లో మమేకమవుతూ రాణిస్తే ఈసారి కూడా జగన్‌మోహన్‌రెడ్డే సీఎం అవుతారని జోస్యం చెప్పారు.

నేడు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి రాక

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్ శుక్రవారం చిత్తూరు జిల్లాకు రానున్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేయనున్నారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఉదయం 7.30 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో సుడిగాలి పర్యటన చేసి ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేయనున్నారు. నాడు–నేడు రెండో దశ పనులు, సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థుల నైపుణ్యాలు, బైజూస్ కంటెంట్ అమలు తీరు, సర్కారు టీచర్ల బోధనా విధానం తదితర అంశాలను పరిశీలించనున్నారు.

మహాపాదయాత్రకు బ్రహ్మరథం

- ఘనంగా ఆహ్వానించిన పల్లె ప్రజలు



మోహిత్‌రెడ్డిని మంగళహారతులతో స్వాగతిస్తున్న మహిళలు

పాకాల: మండలంలోని పెద్దరామాపురం పంచాయతీలో గురువారం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన గడపగడపకు మహాపాదయాత్రకు యువత, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. తమ గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడికి స్థానికులు గజమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అంతేకాకుండా బాణసంచా పేలుళ్లు, మేళతాళాల నడుమ మంగళ హారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. పంచాయతీలోని యనమలవారిపల్లె బీసీ కాలనీ, యనమలవారిపల్లె దళితవాడ, యల్లంపల్లె, వెంకటరామాపురం, చిన్న వెంకటరామాపురం, శాఖమూరి ఇండ్లు, చిగరపల్లె, చిగరపల్లె దళితవాడ, పెద్దరామాపురం, ఇప్పకాలువ గ్రామాల్లో మోహిత్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేసి, ప్రజలతో మమేకమై ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గడపగడపకు తిరుగుతూ ప్రజలకు అందిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. గానుపెంట పంచాయతీ ధనూజవారిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్, కె.వెంకట్రామరెడ్డి, మోహిత్‌రెడ్డి సమక్షంలో పార్టీ విధివిధానాలకు ఆకర్షితులైన తన వర్గంతో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మోహిత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి, సాదరంగా ఆహ్వానించారు.

ప్రజల పక్షాన ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి పక్షపాతం చూపకుండా ప్రజల పక్షాన నిలబడి అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేసిందని, అర్హులైన ప్రతి ఒక్కరు ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందారని మోహిత్‌రెడ్డి అన్నారు. అంతే కాకుండా గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను నెరవేర్చారని, అన్ని రకాల వయస్సుల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రూపంలో ప్రభుత్వం సాయం అందేలా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని కొనియాడారు.

పంచాయతీ అభివృద్ధికి రూ.5.88 కోట్లు

పెద్దరామాపురం పంచాయతీలో అభివృద్ధి పనులకు రూ.5.88 కోట్లు వెచ్చించినట్లు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణం, బీటీ రోడ్లు, కాలువలు, తాగునీటి పైపులైన్ల ఏర్పాటు, ఆర్వో ప్లాంట్ నిర్మాణం, నాడు–నేడులో పాఠశాలలో మౌళిక వసతులు ఏర్పాటు, సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. అలాగే సచివాలయం, ఆర్బీకే, బల్క్ మిల్క్ సెంటర్, వెల్‌నెస్ సెంటర్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. సమావేశ మందిరం, యోగా ధ్యాన మందిరం, కర్మక్రియల భవనం, డిజిటల్ లైబ్రరీ, పాల శీతలీకరణ కేంద్రాలను త్వరలోనే నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంకా అభివృద్ధి చేయాల్సిన పనులు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని, వెంటనే నిధులను విడుదల చేసి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మీలో ఒక్కడిగా ఉంటూ ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితం చేస్తానని మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరుపున చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తనని ఆశీర్వదించి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, సర్పంచ్ కె.స్వర్ణలత, సింగిల్‌విండో చైర్మన్ మునీశ్వర్‌రెడ్డి, రఘుపతి, హరిప్రసాద్‌రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, రహీం, ఆంజినాయుడు, జయచంద్రారెడ్డి, వేణురెడ్డి, చంగల్‌రెడ్డి, బాబు రెడ్డి, శ్రీనివాసులు, మురగయ్య, గోపీ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ వెంకట్రామరెడ్డితో మోహిత్‌రెడ్డి

వైఎస్సార్ సీపీలో చేరిన చిగురపల్లె వాసులు

పాకాల మండలంలోని పెద్దరామాపురం పంచాయతీలో జరుగుతున్న గడపగడపకు మహాపాదయాత్రలో చిగురపల్లె దళితవాడకు చెందిన పలువురు గురువారం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన పాముల రమేష్, జ్యోతి, లక్ష్మమ్మ, జానకమ్మ, దేవి, ప్రమీళ, ఏకాంబరం, నవీన్‌కు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో వారు మాట్లాడుతూ పార్టీ విధి విధానాలు, జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలనకు ఆకర్షితులై, చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రజలకు చేస్తున్న సేవను గుర్తించి పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు.





వైఎస్సార్ సీపీలో చేరిన చిగురుపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్తలతో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

ఆందోళన వద్దు

- ప్రతికార్డుదారునికీ నిత్యావసర సరుకులు అందిస్తాం
- ఆఫ్‌లైన్ విధానంగా తాత్కాలికం
- ఆన్‌లైన్ విధానం వచ్చే నెల నుంచి పటిష్టం



రాజా రఘువీర్

తిరుపతి అర్బన్: రేషన్‌కార్డుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పతి కార్డుదారునికీ బియ్యంతోపాటు అన్ని రకాల నిత్యావసర సరుకులు ఎండీయూ వాహనాల ద్వారా అందిస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజారఘువీర్ పేర్కొన్నారు. గురువారం ఆయన తామ చాంబర్‌లో మాట్లాడుతూ ఈ నెలలో సాంకేతిక సమస్యలతో ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్ పద్ధతిలో(వేలిముద్రలు లేకుండా)సరుకులు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రారంభంలో కాస్త జాప్యం చోటుచేసుకుందని తర్వాత వేగవంతంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.అయితే ఇప్పటివరకు 35 శాతం మందికి మాత్రమే సరుకులు పంపిణీ చేసినట్లు చెప్పారు. సాధారణంగా ఒకటి నుంచి 17వ తేదీ వరకు మాత్రమే సరుకులు పంపిణీ చేయాల్సి ఉందని చెప్పారు. అయితే సాంకేతిక సమస్యలతో జాప్యం చోటుచేసుకున్న నేపథ్యంలో అందరికీ సరుకులు ఇవ్వడానికి గడువు పెంపునకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. 17వ తేదీ పైన కూడా సరుకులు ఇవ్వడానికి చర్యలు చేపడుతామని తెలిపారు. తప్పకుండా ప్రతి కార్డుదారుడికి న్యాయం చేస్తామన్నారు. సెప్టెంబర్‌లో 87.43 శాతం, ఆగస్టులో 87.90 శాతం, జూలైలో 87.48 శాతం మంది రేషన్‌కార్డుదారులకు సరుకులు ఇచ్చామని చెప్పారు. అక్టోబర్‌లో అంతకు మించి సరుకులు ఇవ్వడానికి కృషి చేస్తామన్నారు. జిల్లాలో 369 ఎండీయూ వాహనాల ద్వారా 5,99,297 మంది కార్డుదారులకు సరుకులు ఇవ్వడానికి కృషి చేస్తామని తెలిపారు.

పనులపై కేంద్ర కమిటీ సభ్యులు ఆరా



మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యులు

చిల్లకూరు: మండలంలోని కలవకొండ, బూదనం గ్రామాల్లో 2020–21 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై గురువారం కేంద్ర కమిటీ బృందాల సభ్యులు ఆరా తీశారు. రెండు గ్రామాల్లో పనులను పరిశీలించిన అనంతరం వారు మండల పరిషత్ కార్యాలయంలో పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్ర కమిటీ సభ్యులు ఆరుముళ్ల మురళి మాట్లాడుతూ రెండు గ్రామాల్లో పనులు చేసేందుకు నిధులు విడుదల చేయగా ఒక్క బూదనంలో మాత్రమే నాలుగు పనులకుగాను మూడు పనులు పూర్తి చేశారన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో మౌళిక వసతులు కల్పించేందుకు కేంద్రం నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. అయితే స్థానికంగా ఉండే నాయకులు ఈ నిధులను కనీసం ఖర్చు చేసి అభివృధి సథరం గ్రామాలను నడిపించాలని, అలా కాకుండా నిధులు వెనక్కి వెళ్లేలా చూడడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు ఇలియాజ్, విజయకుమార్, తిరుపతి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సత్యవేడు మునికృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి సక్కా గిరిప్రసాద్ పాల్గొన్నారు.

వెంకటగిరి అభివృద్ధిపై సమీక్ష



తిరుపతి ఎంపీ గురుమూర్తికి పోలేరమ్మ చిత్రపటాన్ని బహూకరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం(వెంకటగిరి): వెంకటగిరి నియోజకవర్గ మరింత అభివృద్ధిపై వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం గురుమూర్తి వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో గురువారం సమీక్షించారు. వెంకటగిరిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రణాళికలపై చర్చించారు. అనంతరం పోలేరమ్మ జాతర విజయవంతానికి సహకరించిన కమిటీ సభ్యులు డాక్టర్ కళాధర్, గోపాల్‌ను సత్కరించి, అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. అంతకుముందు ఎంపీ గురుమూర్తికి నేదురుమల్లి అమ్మవారి కండువా కప్పి పోలేరమ్మ చిత్రపటానికి బహూకరించారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్: సర్వర్ సమస్య తీరడంతో శుక్రవారం నుంచి యథావిధిగా రేషన్‌పంపిణీ జరుగుతుందని డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. సర్వర్ సమస్య తలెత్తడంతో మూడు రోజులుగా ఆఫ్‌లైన్ విధానం ద్వారా రేషన్ అందజేశామన్నారు. ఇకపై పాత పద్ధతిలో రేషన్ పంపిణీ జరుగుతుందని తెలిపారు. కార్డుదారులు ఈ విషయాన్ని గమనించి సరుకులు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

జిల్లాకు పీఓఎస్ మిషన్లు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాకు 145 పీఓఎస్ మిషన్లు వచ్చినట్లు డీపీఓ లక్ష్మి తెలిపారు. వీటి ద్వారా పల్లెలో పన్నుల వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మూడు వేలు అంతకు మించి జనాభా ఉన్న ప్రాంతాల్లో వీటి ద్వారా వసూలు చేస్తారన్నారు. ఆయా గ్రామాల వారీగా ఇంటి యజమాని వివరాలు, ఇంటి విస్తీర్ణం, భవన నిర్మాణ తీరు ఆధారంగా నిర్ధారించిన పన్నుల వివరాలన్నీ మిషన్లతో అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు.

ఇన్‌స్పైర్‌లో 'మూర్తి' భవించిన సృజన

- జాతీయస్థాయిలో జిల్లా పేరు నిలబెట్టిన మూర్తిచేతన్
- తక్కువ రసాయనాలతో స్ప్రేచేసే యంత్ర ప్రయోగానికి అవార్డు



తాను తయారు చేసిన యంత్రంతో మూర్తిచేతన్

పలమనేరు: ఢిల్లీలో జరిగిన పదో జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన విద్యార్థి మూర్తి చేతన్ అవార్డును దక్కించుకుని పేరునిలబెట్టాడు. జాతీయ స్థాయిలో మొత్తం 441 ప్రాజెక్టులను ఢిల్లీలో ప్రదర్శించగా, ఇందులో ఏపీ నుంచి 30 ఉన్నాయి. నాలుగు స్థానాలను మన రాష్ట్రం కైవసం చేసుకుంది. వీటిల్లో చిత్తూరు, అనంతపురం, గుంటూరు,ప్రకాశం జిల్లాలకు చెందిన ఒక్కో ప్రాజెక్టుకు అవార్డు దక్కింది. జిల్లా సైన్స్ అధికారి రమణ(పలమనేరు) గురువారం వివరాలు వెల్లడించారు. ఢిల్లీలో మూడు రోజుల కిందట జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుల పోటీలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని తిరుపతి భారతీయ విద్యా భవన్ ఎస్వీ విద్యాలయ పాఠశాలకు చెందిన మూర్తిచేతన్ ప్రదర్శించిన తక్కువ మోతాదులో రసాయనిక ఎరువులను పిచికారీ చేసే యంత్రం ప్రయోగానికి అవార్డు దక్కింది. భూమిలో రసాయనిక ఎరువులను ఎక్కువగా వినియోగించడం ద్వారా యూట్రోఫికేషన్, మట్టి సారం కోల్పోవడం, ఈ పంట ఉత్పత్తుల ఉపయోగిస్తే సంతానోత్పత్తి క్షీణించడం లాంటి సమస్యలున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు చేతన్ ఓప్లాస్టిక్ డబ్బా, వాల్వ్, రెండు స్ప్రాకెట్లు, ఓ హ్యాండిల్, సైకిల్ చైన్, బెల్ట్, రాడ్‌ల సాయంతో తక్కువ ఖర్చుతో మందుల పిచికారీ యంత్రాన్ని రూపొందించాడు. తద్వారా స్ప్రాకెట్‌ను తిప్పినపుడు డబ్బాలో వత్తిడి పెరిగి తక్కువ మోతాదులో క్రిమిసంహారక మందులు మొక్కలకు చేరతాయి. దీంతో రసాయనాల మోతాదును తగ్గించవచ్చనే ప్రయోగం న్యాయ నిర్ణేతలను మెప్పించింది. ఈ విద్యార్థికి గైడ్ టీచర్‌గా వ్యవహరించిన గంగాధరనెల్లూరు మండలం మురళిని సైతం జిల్లా విద్యాశాఖ అభినందించింది. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రయోగాన్ని చేసిన మూర్తి చేతన్ కేంద్ర సైన్స్‌అండ్ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్, ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ అధ్యక్షురాలు డాక్టర్ నమితాగుపత్త, కార్యదర్శిఅభయ్‌కరణ్, చీఫ్ ఇన్నవేటివ్ ఆఫీసర్ డాక్టర్ విపిన్‌కుమార్‌ల నుంచి ఈ అవార్డును ఢిల్లీలో అందుకున్నారు. ఈ విద్యార్థిని స్థానిక ఉమ్మడి చిత్తూరు జిల్లా డీఈవోలు విజయేంద్రరావు, శేఖర్, సమగ్రశిక్ష పీడీ వెంకటరమణారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రమణ అభినందించారు.

స్విమ్స్‌లో ముఖహాజరు విధానం ప్రారంభం



ముఖహాజరు విధానాన్ని ప్రారంభిస్తున్న టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి

తిరుపతి కల్చరల్: స్విమ్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది హాజరు కోసం ముఖహాజరు విధానాన్ని అమలు చేశారు. ఇందులో భాగంగా మొదటి విడతగా గురువారం 19 పరకరాలతో ముఖహాజరు విధానాన్ని టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ నుంచి ఈ విధానాన్ని పూర్తి గా అమలులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. అలాగే స్విమ్స్‌లో ఇన్ పేషెంట్స్‌గా చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య స్థితి, వివరాలను ఆన్‌లైన్‌లో త్వరితగతిన పొందుపరచడానికి కంప్యూటర్ ఆన్ వీల్స్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసువచ్చామన్నారు. కార్యక్రమంలో స్విమ్స్ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.జయచంద్రారెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ కోటిరెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి వెంకటరామిరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ ఎం.సురేష్, డిప్యూటీ డైరెక్టర్ నర్సింగ్ ప్రభావతి, ఏడీ.సతీష్‌రెడ్డి, బీఎంఐటీ సందీప్‌రెడ్డి, ప్రణయతేజ, కంప్యూటర్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

స్విమ్స్‌కు హైడ్రాలిక్ స్ట్రెచ్చర్ల విరాళం

స్విమ్స్ ఆస్పత్రికి హైదరాబాద్‌కు చెందిన దంజా హెల్త్ కేర్ కంపెనీ రూ.5,72,300 విలువ చేసే ఐదు హైడ్రాలిక్ స్ట్రెచ్చర్లను గురువారం టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి ద్వారా స్విమ్స్ స్టోర్స్ సిబ్బందికి అందజేసింది. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ సదాభార్గవి, స్విమ్స్ సంచాలకుడు డాక్టర్ ఆర్‌వీ.కుమార్, స్విమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో ఘనంగా అమృత కలశ యాత్ర



అమృత కలశ యాత్రలో పాల్గొన్న వీసీ భారతి, అధ్యాపకులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ బ్యూరో ఆధ్వర్యంలో బుధవారం అమృత కలశ యాత్రను ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతి నలుమూలల నుంచి సేకరించిన మట్టి, బియ్యాన్ని అమృత కలశంలో నింపారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ భారతి మాట్లాడుతూ అమృత కలశ యాత్ర విశిష్టమైనదన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజనీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విద్యావతి, స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ సుజాతమ్మ, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ అనూరాధ, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ గంగాభవానీ, ప్రొఫెసర్ త్రిపుర సుందరి, బోధనా సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

28న క్విజ్ పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు, అధికారులు

తిరుపతి కల్చరల్: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి నగరపాలక సంస్థ, తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ నెల 28వ తేదీన ఇందిరా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో క్విజ్ పోటీలు నిర్వహించనున్నాయి. ఈ క్రమంలో గురువారం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దరఖాస్తులు ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50 వేలు, తృతీయ బహుమతిగా రూ.25 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. నవంబర్ 14వ తేదీన కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించే బాలల దినోత్సవంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధిలో గురువారం విజయదశమి వాల్‌పోస్టర్ల ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు ఆవిష్కరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కనకాచలంపై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు దేవీ నవరాత్రి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

మత్స్యశాఖలో 8 సాగర్‌మిత్ర ఉద్యోగాలు

తిరుపతి అర్బన్: మత్స్యశాఖలో తాత్కాలిక ప్రాతిపదికన కాంట్రాక్ట్ పద్ధతిలో 8 సాగర్‌మిత్ర ఉద్యోగాలు భర్తీ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు తిరుపతిలోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. సాగర్‌మిత్రలుగా పనిచేయడానికి డిప్లొమా, పాలిటెక్నిక్ ఇన్ ఫిషరీస్, బీఎస్సీ ఫిషరీస్ సైన్స్, మెరైన్ బయాలజీ, జువాలజీ డిగ్రీ విద్యార్హతగా పేర్కొన్నారు. నెలకు వారికి ప్రోత్సాహకార రుసుం రూ.15 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో 91829 16117, 97058 01305 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి దసరా సెలవులు

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు ఈనెల 14వ తేదీ నుంచి దసరా సెలవులు ప్రకటిస్తున్నట్లు వర్సిటీ అకాడమిక్ డీన్ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలు ఈనెల 23వ తేదీ తిరిగి ప్రారంభం అవుతాయన్నారు. అలాగే ఎంఎల్ఐఎస్‌ఈ నాలుగో, రెండో సెమిస్టర్ ఫలితాలు గురువారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి దామ్లానాయక్ తెలిపారు.

తిరుపతిలో జాతీయ వాక్యార్థ సంగోష్టి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శంకరాచార్య అంతర్జాతీయ అధ్యయన కేంద్రం డైరెక్టర్ శ్రీకలా నాయర్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ : తిరుపతి సంస్కృత విద్యాపీఠంలోని ఆచార్య రామారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో గురువారం రెండు రోజుల జాతీయ వాక్యార్థ సంగోష్టి కార్యక్రమం ప్రారంభమైంది. దీన్ని పరమాచార్యశాస్త్ర పరిరక్షణ కేంద్రం, కేరళ రాష్ట్రంలోని కాలడీ నగరంలో ఉన్న శంకరాచార్య సంస్కృత వర్సిటీ శంకరాచార్య అంతర్జాతీయ అధ్యయన కేంద్రం సంయుక్తంగా చేపట్టాయి. ఈ సందర్భంగా వేదాంతం, వ్యాకరణం, మీమాంస, న్యాయ, సాహిత్య శాస్త్రాల్లో ఉన్న వివిధ అంశాలపై చర్చించనున్నారు. ఇందులో ముఖ్యఅతిథిగా కేరళ రాష్ట్రంలోని కాలడీలో ఉన్న శంకరాచార్య సంస్కృత వర్సిటీ శంకరాచార్య అంతర్జాతీయ అధ్యయన కేంద్రం డైరెక్టర్ శ్రీకలా నాయర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వాక్యార్థ సంగోష్టి ద్వారా శాస్త్రాలపై విశేష చింతన జరుగుతుందని, తద్వారా అధ్యాపకులు, విద్యార్థులు అత్యంత నిగూఢమైన శాస్త్రీయ అంశాలను లోతుగా తెలుసుకుంటారని వెల్లడించారు. రీసెర్చ్ విద్యార్థులు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, పరిశోధించడానికి ఈ గోష్టి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ శాస్త్ర అధ్యయనం గరిమను, జ్ఞానాన్ని పరిశీలించడానికి ఈ వాక్యార్థ సభలు ఎంతో ముఖ్యమని వివరించారు. విశ్వవిద్యాలయంలో వేదాంతం, వ్యాకరణం, మీమాంస, న్యాయ శాస్త్రాల్లో వాక్యార్థ సభలను పారంపర్యంగా నిర్వహించే వారని, ఆ పరంపరను ఇప్పుడు కూడా కొనసాగిస్తున్నట్టు తెలిపారు. అద్వైత వేదాంత విభాగం అధ్యక్షుడు కె.సతీష్, ఇతర అధ్యాపకులు, విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల ఆచార్యులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే ఉద్యమం తప్పదు

- టీటీడీ నిధులు ఒక శాతం కేటాయింపు శుభపరిణామం
- ఇది పౌర సమాజ విజయం
- విమర్శకులు ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు
- టీటీడీ చైర్మన్, ఈఓకు అభినందనలు
- ఐదు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించిన పౌర సమాజం


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి


హాజరైన పౌరసమాజం సభ్యులు

తిరుపతి సిటీ: నగరాభివృద్ధిని అడ్డుకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తిరుపతి పౌరసమాజం హెచ్చరించింది. తిరుపతి పౌర సమాజం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎల్‌ఐసీ రోడ్డులోని ఆఫీసర్స్ క్లబ్ సమావేశ మందిరంలో టీటీడీ నిధుల కేటాయింపుపై అభినందన మందార మాల అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు తులసేంద్ర ఐదు తీర్మానాలను ప్రతిపాదించగా సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇందులో ప్రధానంగా తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు ఒక శాతం కేటాయింపుపై హర్షం వ్యక్తం చేసింది. దీంతో పాటు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కృషిని ప్రశంసిస్తూ ఆయనకు అభినందనలు తెలిపింది. భవిష్యత్తులో ఒక శాతం నుంచి సుమారు 5 శాతం వరకు నిధులు కేటాయింపు జరిగితే తిరుపతి మరింత అభివృద్ధి జరుగుతుందని నిర్ణయించింది. తిరుపతి పారిశుద్ధ్య పనుల్లో టీటీడీ భాగస్వామం లేకుండా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలోనే జరగాలని తీర్మానించింది. అనంతరం డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. గత పౌర సమాజ సభలో తీసుకున్న తీర్మానాన్ని గౌరవించి టీటీడీ పాలకమండలి బడ్జెట్‌లో ఒక శాతం నిధులను తిరుపతి అభివృద్ధికి కేటాయించేందుకు ఆమోదం తెలపడం శుభపరిణామమన్నారు. మూడు నెలలుగా ఈ విషయంపై కసరత్తు చేస్తుంటే అభివృద్ధి నిరోధకులు కుయుక్తులతో టీటీడీ నిధులను ఆపేందుకు అధికారులపైన, టీటీడీ యాజమాన్యంపైన పెద్ద ఎత్తున్న ఒత్తిడి చేయడం దారుణమన్నారు. టీటీడీ బోర్డులోని పలు రాష్ట్రాలకు చెందిన బోర్డు సభ్యులు సైతం తిరుపతి అభివృద్ధి ఆవశ్యకతను గుర్తించి, నిధుల కేటాయింపునకు ఆమోదం తెలపడం సంతోషకరమన్నారు. ఈ నిర్ణయం వెనుక చైర్మన్, అధికారుల కృషితో పాటు నగర మేధావులు, విద్యావంతులు, సామాజికవేత్తలు, నగరపౌరుల కృషి ఉందన్నారు. ఇది పౌర సమాజ విజయంగా అభివర్ణించారు. ఎన్నికల కోసమో, ఓటు బ్యాంకు కోసమో రాజకీయం చేయలేదని, రాజకీయాలకతీతంగా కేవలం నగరాభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. డిసెంబర్‌లోపు ఈ ప్రక్రియ పూర్తవుతుందని, అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే పౌర సమాజం ఊరుకోదని ఉద్యమం చేపడుతుందన్నారు. అనంతరం శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ తిరుపతి, తిరుమలను వేరుగా చూడలేమని, భక్తులు శ్రీవారి దర్శనానికి వెళ్లేందుకు మొదటి అడుగు తిరుపతిలోనే పెట్టాలని గుర్తు చేశారు. భక్తుల సౌకర్యార్థం నగరాభివృద్ధి ఎంతో అవశ్యకమన్నారు. దీన్ని సైతం రాజకీయ కోణంలో చూస్తూ కొంతమంది అజ్ఞానంతో విమర్శించడం దారుణమన్నారు. వాటికన్ సిటీలో ఆధ్యాత్మిక సంస్థలు నగరాభివృద్ధిలో భాగస్వాములు అవుతుండడంతోనే నగరాలు అభివృద్ధి జరిగాయన్నారు. శ్రీనివాస సేతు తరహా మరిన్ని ఫ్లైఓవర్లు నగరానికి అవసరమని ప్రధానంగా బస్టాండ్ నుంచి యూనివర్సిటీల వరకు, అన్నమయ్య సర్కిల్, బాలజీ కాలని తదితర ప్రాంతాలలో నిర్మించాలని కోరారు. అభినయ్ విజన్ ఉన్న వ్యక్తి కాబట్టే మాస్టర్ ప్లాన్‌రోడ్లు, ఫ్రీలెఫ్టులు, రోడ్ల విస్తరణ కార్యక్రమాలు చేపట్టి నగరానికి ఒక రూపు తీసుకువచ్చారని కొనియాడారు.

ఢిల్లీ నుంచి నగరాన్ని పాలిస్తామంటే ఊరుకోం

అనంతరం సీపీఎం సీనియర్ నాయకులు కందారపు మురళి, జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ తిరుపతి నగరాభివృద్ధికి తమ పార్టీ సహకరిస్తుందన్నారు. తిరుపతిని ఢిల్లీ నుంచి పాలిస్తామంటే సహించేది లేదని హెచ్చరించారు. 9 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉంటూ హిందూ మతానికి పేటెంట్ హక్కులు మావే అనుకొంటున్న పార్టీలు తిరుపతికి ఏమి చేశాయని ప్రశ్నించారు. సీపీఐ నాయకుల తులసేంద్ర, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు హరిక్రిష్ణ మాట్లాడుతూ బీజేపీ నాయకులు అర్థం లేని మాటలతో అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నించడం దారుణమని, వారు ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. సాహితీవేత్త, ఎస్వీయూ రిటైర్డ్ ప్రిన్సిపల్ మధురాంతకం నరేంద్ర, రిటైర్డ్ ప్రిన్సిపల్ స్వరాజ్యలక్ష్మి, సాకం నాగరాజు మాట్లాడుతూ భక్తుల తొలి పాదం తిరుపతిలోని పడుతుందని అన్ని సౌకర్యాలు నగరంలో భక్తులుకు అందుబాటులో ఉంటే శ్రీవారి దర్శనం సాఫీగా సాగుతుందన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ మోహన్‌రాజు, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఆర్కాట్ కృష్ణప్రసాద్, టీటీడీ నుంచి దాసు, పులిగోరు ప్రభాకరరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ నేతాజీ, అడ్వకేట్ రాజారెడ్డి, మహిళా నాయకురాలు మస్తానమ్మ, అక్కినపల్లి లక్ష్మయ్య, రమేష్‌రెడ్డి, కాంట్రాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, బ్లిస్ హోటల్ అధినేత సూర్యనారాయణరెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరశింహచారి తదితరులు పాల్గొన్నారు.

జెండా వేడుక.. దసరా ప్రారంభ సూచిక


సంగం థియేటర్ కూడలి ప్రాంతంలో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ దీపాల సెట్టింగ్

- జెండా పండుగకు ముస్తాబవుతున్న గూడూరు
- 14న గూడూరులో జెండా మహోత్సవం


ఆంజనేయస్వామి జెండాకు తుది మెరుగులు దిద్దుతున్న చిత్రకారులు


కోనేటిమిట్టిలో ఏర్పాటు చేసిన గణనాథుడి కటౌట్

గూడూరురూరల్: గూడూరులో ఆంజనేయస్వామి జెండా వేడుక.. దసరాకు ప్రారంభ సూచికగా నిలుస్తోంది. దసరాకు ముందుగా ఆంజనేయస్వామి జెండా ఉత్సవాన్ని మైసూరులో మాత్రమే వైభవంగా నిర్వహిస్తారు. ఆ తరువాత స్థానం గూడూరుకే దక్కుతుంది. దీంతో గూడూరుకు రెండో మైసూరు అనే గుర్తింపు ఉంది. ఏటా గూడూరులో దసరాకు ముందు వచ్చే మహాలయ అమావాస్య రోజున ఆంజనేయస్వామి జెండా ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఈనెల 14వ తేదీ రాత్రి ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలకు గూడూరు పట్టణం ముస్తాబవుతోంది.

జెండా పండుగ ప్రాశస్త్యం ఇలా...

1940వ దశకంలో గూడూరు పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో కలరా, మశూచి తదితర అంటు వ్యాధులు ప్రబలడంతో మనుషులతోపాటు పశు సంపద కూడా వ్యాధుల బారిన పడి మృతి చెందేవి. అలాగే సకాలంలో వర్షాలు కురవక పంటలు పండకపోవడంతో అరిష్టం వచ్చిందని అందరూ భావించారు. దీంతో 1948లో పట్టణంలోని బజారువీధిలో ఉన్న యువత, చెన్నకేశవస్వామి ఆలయం ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి జెండాను ఊరేగించారు. దీంతో అప్పటి నుంచి వ్యాధులు రాకపోవడమేకాక సకాలంలో వర్షాలు పడి, పంటలు పండాయి. దీంతో అప్పటి నుంచి ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు.

రూ.132తో మొదలై... రూ.లక్షలకు చేరిక

గూడూరు పట్టణంలోని తూర్పువీధికి చెందిన యువత 1969లో ఈ జెండా పండుగకు రూ.132 వెచ్చించి కర్రకు ఆంజనేయస్వామి జెండాను కట్టి పట్టణంలో ఊరేగించినట్లు పెద్దలు చెబుతుంటారు. కాలక్రమేణా అది రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వెచ్చించి, ఈ జెండా పండుగను వైభవంగా నిర్వహించేలా పోటీ పడుతున్నారు. ఒకటి, రెండో పట్టణంలో చిన్న, పెద్ద జెండాలు కలిపి సుమారు 100 వరకు ఉత్సవంలో ఊరేగనున్నాయి. దీంతో ఈ ఏడాది జెండా ఉత్సవాలకు సుమారు రూ.10 కోట్ల వరకు ఖర్చవుతుందని పట్టణవాసులు అంచనా వేస్తున్నారు.

యువతే ప్రధాన ఆకర్షణ...

ఏటా నిర్వహించే ఆంజనేయస్వామి జెండాకు అమెరికా, కెనడా, లండన్, ఆస్ట్రేలియా విదేశాల్లో స్థిరపడిన గూడూరు వాసులు సైతం తప్పకుండా వస్తారు. జెండా పండుగ నిర్వహణలో యువతదే ప్రధాన భూమిక. ఈ జెండా పండుగను చూసేందుకు జిల్లా నుంచే కాక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు.

మిరుమిట్లు గొలిపే విద్యుద్దీప కాంతులు.. భారీ సెట్టింగ్‌లు

ఆంజనేయస్వామి జెండా మహోత్సవానికి భారీ సెట్టింగులు, మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణలతో పట్టణం దేదీప్యమానంగా వెలిగిపోతుంది. పట్టణంలోని అన్ని వీధుల్లో విద్యుత్ కాంతుల వెలుగుల్లో దేవతామూర్తుల కటౌట్లను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా నృత్య ప్రదర్శనలు.. విచిత్ర వేషధారణలు

ఆంజనేయస్వామి జెండాలను ట్రాక్టర్లపై ఉంచి, ప్రత్యేక అలంకరణ చేసి తీన్‌మార్, తెనాలి బ్యాండ్ మేళాలు, బేతాళ, కాళికా, డీజే, లిల్లీపుట్స్, తప్పెట్లు, కీలుగుర్రాలు, హైదరాబాద్ బ్యాండ్, కర్ణాటక డ్యాన్స్, బుట్టబొమ్మలు, మంగళవాయిద్యాలతో పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. ఆ మరుసటిరోజు పలు ఆలయాల్లో కలశాలను ఏర్పాటు చేసి, దసరా ఉత్సవాలు ప్రారంభిస్తారు.

భారీ భద్రతా ఏర్పాట్లు...

పట్టణంలో ఆంజనేయస్వామి జెండా ఉత్సవం సందర్భంగా భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. డీఎస్పీతోపాటు ఆరుగురు సీఐలు,16 మంది ఎస్‌ఐలు, 275 మంది కానిస్టేబుళ్లు, మరో 50 మంది మహిళా కానిస్టేబుళ్లు మొత్తం 350 మందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

కల్యాణ వెంకన్నకు బంగారు, వెండి ఆభరణాల బహూకరణ


ఆలయాధికారులకు బంగారు, వెండి ఆభరణాలు అందజేస్తున్న దాతలు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారికి దాతలు పెద్ద ఎత్తున బంగారు, వెండి ఆభరణాలను బహూకరించారు. ఈ మేరకు గురువారం ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మికి వాటిని అందజేశారు. ఆమె మాట్లాడుతూ తమిళనాడులోని సేలం నగరానికి చెందిన కృపాకర్, రవి, కిషోర్ కుమార్ తమ కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి ఉత్సవమూర్తికి సుమారు 250.940 గ్రాముల బంగారు శంకు, హస్తం, సుమారు 13.128 కిలోల బరువున్న వెండి గంట, ధూప పల్లెం, హారతి పల్లెం, సుమారు 37.128 కిలోల బరువు గల శంకు, చక్రాలు, దీప స్తంభాలను విరాళంగా అందజేసినట్లు తెలిపారు. దాతలు సమర్పించి బంగారు, వెండి ఆభరణాల విలువ సుమారు రూ.59.51లక్షల ఉంటుందన్నారు. దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో ప్రదోష పూజలు


పుష్పాలంకరణతో నందీశ్వరుడు

నాగలాపురం: మండలంలో సురుటుపల్లెలోని శ్రీ పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో గురువారం భక్తిప్రపత్తులతో ప్రదోష పూజలు చేశారు. నందీశ్వరుడు, శ్రీ వాల్మీకేశ్వర స్వామికి ఏకకాలంలో పూజలు చేశారు. పూజార్చన కార్యక్రమాలకు చెన్నైకు చెందిన క్రితిక అజిత్ కుమార్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ బాలాజీ రెడ్డి, కార్యనిర్వహణా ధికారి కె.రామచంద్రా రెడ్డి వారికి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ప్రదోషం అనంతరం ఉత్సవమూర్తిని ఊరేగించారు. ఆలయ పాలక మండలి సభ్యులు కె.ఆనంద్, ఎస్‌ఎం సురేష్, అర్చకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి


వెంకటలక్ష్మి మృతదేహం

ఏర్పేడు: మండలంలోని కందాడు పంచాయతీ పరిధిలో ఉన్న శివగిరి ఎస్టీ కాలనీకి చెందిన వెంకటలక్ష్మి(30) అనే మహిళ గురువారం మృతి చెందింది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని శివగిరి ఎస్టీ కాలనీకి చెందిన వెంకటలక్ష్మి మినీ అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తోంది. గురువారం సాయంత్రం విధులు నిర్వహించుకుని ఇంటికి వెళ్లింది. తరువాత కొంతసేపటికే ఆమె కుప్పకూలి కింద పడి మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. రేణిగుంట ప్రాజెక్ట్ సీడీపీఓ కృష్ణమంజరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నమ్మ, కార్యకర్తలు ఆమె మృతి పట్ల సంతాపం తెలిపారు. ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని మృతురాలి కుటుంబం కోరుతోంది.